ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 9 మార్చి 2025







మహిళలతో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేల గ్రూప్ ఫొటో, హాజరైన మహిళలు, ప్రముఖులు

చదవండి.. చదివించండి..!

పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరండి

మహిళలకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచన

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు బాగా చదువుకోవాలని, తమ పిల్లలను బాగా చదివించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. కృషి, పట్టుదలతో సాధన చేసి ఎంచుకున్న రంగాలలో ఉన్నతస్థాయికి చేరాలని అన్నారు. జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్య వివాహాల నియంత్రణ, మహిళల ఆరోగ్యాన్ని కాపాడటాన్ని సవాలుగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. మహిళల జోలికి వస్తే ఉపేక్షించవద్దని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పలుమార్లు సూచించారని, ఆ దిశగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.





డ్వాక్రా సంఘాల మహిళలకు మెగా చెక్ అందజేస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

మహిళా పక్షపాతి చంద్రబాబు: అంబికా



డ్వాక్రా సంఘాల సృష్టికర్త సీఎం చంద్రబాబు అని, ఆయన మహిళా పక్షపాతి అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. మహిళను దేవతగా భావించి, గౌరవించే దేశంలో జన్మించడం తన పూర్వజన్మ సుకృతమని అన్నారు. మహిళామూర్తుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని చంద్రబాబు మహిళలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీ మేరకు త్వరలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని అన్నారు.

అలరించిన వేడుకలు

మహిళా దినోత్సవంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు, మహిళల ఆత్మరక్షణ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ శాఖలలో ఉత్తమ సేవలు అందిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. శాఖల స్టాల్స్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.101.13 కోట్లు, పీఎంఏజేఏవై కింద రూ.1.07 కోట్లు, స్త్రీనిధి కింద రూ.12.78 కోట్లు, ముద్ర రుణాలు రూ.3.60 కోట్లు, మెప్మా సంఘాలకు రూ.17.76 కోట్లు, హ్యాండ్‌లూమ్ కింద రూ.12.75 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుశీలమ్మ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో మలోల, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణా రెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, తహసీల్దారు హరికుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, జిల్లా సహకార శాఖ అధికారి అరుణకుమారి, హౌసింగ్ పీడీ శైలజ, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాధిక, ఎల్‌డీఓ నర్సింగారావు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, డీఎస్పీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి గొప్పది: గిరిజమ్మ



ప్రపంచంలో మహిళాశక్తి అత్యంత గొప్పదని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. తాను మహిళను అయినందుకు ఎంతో గర్విస్తున్నానని అన్నారు. విమానాలు, రైళ్ళు, సముద్రాల్లో స్టీమర్లు నడిపే స్థాయికి మహిళలు ఎదిగారని, రాకెట్లు ప్రయోగించే శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారని అన్నారు. మహిళలు, విద్యార్థినుల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న అనంత ఆత్మరక్షణ కార్యక్రమాన్ని ఆమె అభినందించారు. మహిళల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కాపాడాలని కోరారు. మహిళలపై జరుగుతున్న దాడుల నియంత్రణకు చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

చంద్రబాబు ఆదర్శం: పరిటాల సునీత



తన భర్త పరిటాల రవీంద్రను పొట్టనపెట్టుకున్న దుర్మార్గుల నుంచి తన పిల్లలను కాపాడుకునేందుకు ఎక్కడికైనా వెళ్ళిపోవాలని ఒక మహిళగా నిర్ణయించుకున్నానని, కానీ చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాలలో నిలబడగలిగానని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. తనకు చంద్రబాబు పెద్దన్నగా వెన్నంటి నిలిచారని, వంటింటికి పరిమితమైన తనకు ఎమ్మెల్యే సీటు ఇచ్చి గెలిపించి, మంత్రి పదవి ఇచ్చారని అన్నారు. మహిళల ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబన, మహిళా సాధికారత సాధన దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఆశా, అంగన్‌వాడీలతో పాటు మహిళా ఉద్యోగులకు సీఎం చంద్రబాబు వరాలు కురిపించారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.20లక్షల మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు పంపిణీ చేయనున్నారని తెలిపారు. క్యాన్సర్‌తో ఏ ఒక్క మహిళా మరణించకూడదని, ఆ దిశగా రెండు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియా, సెల్‌ఫోన్లతో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మహిళలను గౌరవించే ప్రభుత్వం: బండారు శ్రావణిశ్రీ



మహిళలను గౌరవించే ప్రభుత్వంలో ఉండటం తనకు స్ఫూర్తి కలిగిస్తోందని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మహిళా పక్షపాతిగా సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలను తీసుకువస్తున్నారని, మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలను చంద్రబాబు కల్పిస్తున్నారని అన్నారు. చంద్రబాబు విజన్ తనకు స్ఫూర్తి అని అన్నారు. ఆడబిడ్డల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని కోరారు.

సమానత్వంతో జాతి మనుగడ

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జాతి మనుగడకు స్త్రీ, పురుష సమానత్వం ముఖ్యమని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని జిల్లా కోర్టులో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా దినోత్సవం ఎలా ఆవిర్భవించిందనేది వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూదేవికి ఉన్నంత ఓర్పు, సహనం మహిళలకు ఉంటుందన్నారు, సమాజంలో మహిళల ప్రాముఖ్యతను తెలియజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు జిల్లా యంత్రాంగం సహకారం అందిస్తుందని అన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయగా 300 మంది పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు బాలాకుమారి, ప్రసూన, మాధవి, పవిత్ర, మాధుర్య, రాణి ఐశ్వర్య, అక్బర్, శివప్రకాష్‌రావు, మహమ్మద్ ఆరిఫ్‌ను, ఇతర జ్యుడీషియల్ అధికారులను, మహిళలను జిల్లా న్యాయాధికారి, కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు నాయాధికారి సత్యవాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, బార్‌కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి, మహిళా కోర్టు న్యాయాధికారి శోభారాణి, పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి సాధుబాబు, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి నిర్మల, ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి పావని, మొబైల్ కోర్టు న్యాయాధికారి సుధీర్‌కుమార్, స్పెషల్ మెజిస్ట్రేట్ సుబ్బారావు, శివశంకర్, రాయదుర్గం జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రమ్య, కన్స్యూమర్ ఫోరం ప్రెసిడెంట్ శ్రీలత, ఫోరం సభ్యురాలు గ్రేస్‌మేరీ, సీనియర్ అడ్వకేట్ పద్మజ, జ్యుడీషియల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, కోర్టు మేనేజర్ మాధవీలత పాల్గొన్నారు.

లోక్ అదాలత్...

జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, ఎస్పీ జగదీష్ పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని జిల్లా న్యాయాధికారి తెలిపారు. వీలైనన్ని కేసులు లోక్‌అదాలత్‌లో రాజీ అయ్యేలా చూడాలని సూచించారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం: ఎస్పీ



విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళల పాత్ర కీలకమని, జిల్లాలో మహిళల భద్రతకు పెద్ద పీట వేశామని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో సాధికారత దిశగా పయనిస్తుండటం హర్షణీయం అన్నారు. మహిళల భద్రతలో భాగంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఉమెన్ హెల్ప్ డెస్క్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు స్వేచ్ఛగా, నిర్భయంగా వారి బాధలు చెప్పుకునేలా ఇవి తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. మహిళా సాధికారత వారోత్సవాల్లో వ్యాసరచన, పెయింటింగ్, వక్తృత్వపు పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్ బాషా, డీఎస్పీలు మహబూబ్‌బాషా, శ్రీనివాసరావు, నీలకంఠేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, స్వరూప, గౌస్‌మొహిద్దీన్ తదితరులు

అనంతపురం అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్ పలువురు తెలుగు మహిళలతో కలిసి కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో కురుబ నారాయణస్వామి, తెలుగు మహిళలు మణెమ్మ, వసుంధర, లక్ష్మీనాయుడమ్మ, రహ్మత్‌బీ, వడ్డే సరళ, శకుంతమ్మ, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్‌లో కాసుల వర్షం..!

పింఛన్‌దారుల నుంచి వసూళ్లు

ఆసుపత్రి, డీఆర్‌డీఏ సిబ్బంది కుమ్మక్కు

పరస్పర ఆరోపణలతో వెలుగులోకి..

తాత్కాలికంగా బ్రేక్..

11 నుంచి పునఃప్రారంభం



అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పింఛన్ వెరిఫికేషన్‌కు హాజరైన దివ్యాంగులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా పింఛన్లు పంపిణీ చేశారు. అర్హత లేకపోయినా కొందరు దివ్యాంగుల పేరుతో ధ్రువపత్రాలు సంపాదించి.. ఆ మేరకు పింఛన్లు తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నకిలీ పింఛన్లపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కొందరు డీఆర్‌డీఏ, వైద్య సిబ్బంది వసూళ్లకు తెరలేపారు. వైద్యులతో మాట్లాడి మీ ధ్రువపత్రాలకు ఆమోదం వేయిస్తామని భారీగా డబ్బులు లాగుతున్నట్లు తెలుస్తోంది.

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పింఛన్ రీ వెరిఫికేషన్‌తో కొందరు జేబులు నింపుకుంటున్నారు. పింఛన్‌దారులకు గాలం వేసి తాము రీ వెరిఫికేషన్‌లో ఇబ్బంది లేకుండా చేయిస్తామంటూ.. ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ల పేరుతో వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాకు చెందిన పింఛన్‌దారులు రీ వెరిఫికేషన్ కోసం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వస్తున్నారు. సత్యసాయి జిల్లాకు చెందిన కొందరు ఉద్యోగులకు విధులు కేటాయించారు. ఆ జిల్లాకు చెందిన పింఛన్‌దారులతో రీ వెరిఫికేషన్ సక్సెస్‌కు రూ.30వేల వరకు ఇస్తే పని జరుగుతుందని వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సత్యసాయి జిల్లా డీఆర్‌డీఏ-వెలుగులో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని ఇందులో కీలకంగా వ్యవహరించినట్లు చెబుతున్నారు. ఈఎన్‌టీ విభాగంలో పనిచేసే సిబ్బంది ముగ్గురుతో పాటు సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న కొందరు ఇందులో పాలుపంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తాత్కాలికంగా పింఛన్ రీ వెరిఫికేషన్‌కు బ్రేక్ పడింది. ఈనెల 11 నుంచి పింఛన్ రీ వెరిఫికేషన్ తిరిగి ప్రారంభించనున్నారు.

పరస్పర ఆరోపణలతో రచ్చ

అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ఉమ్మడి జిల్లాకు చెందిన మానసిక, ఈఎన్‌టీ కేటగిరి పింఛన్‌దారులు వస్తున్నారు. ఈఎన్‌టీ, ఎంఆర్ విభాగాల్లో పనిచేస్తున్న ఆసుపత్రి సిబ్బంది పింఛన్‌దారులకు రీ వెరిఫికేషన్‌లో సక్సెస్ చేయిస్తా మంటూ..ఒక్కొక్కరి నుంచి రూ.20వేల నుంచి రూ.40వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. సత్యసాయి జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి ప్రభుత్వ ఆసుపత్రి ఈఎన్‌టీ విభాగంలో పనిచేస్తున్న మరో ఉద్యోగి పరస్పర ఆరోపణలు చేసుకోవడంతో రచ్చకెక్కింది. ఈ విషయం డీఆర్‌డీఏ-వెలుగు ఉన్నతాధికారుల వద్దకు చేరినట్లు సమాచారం. సత్యసాయి జిల్లా డీఆర్‌డీఏలో పనిచేస్తున్న ఓ మండల స్థాయి అధికారితో ఈఎన్‌టీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి బేరం కుదుర్చుకున్నట్లు ఆ శాఖలో చర్చ సాగుతోంది.

45,820 మందికి వైద్యపరీక్షలు

అనంతపురం జిల్లాలో దివ్యాంగుల కేటగిరిలో రూ.6వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుల రీ వెరిఫికేషన్ ప్రారంభించారు. వీరిలో 45,820 మంది ఉన్నారు. మొదటి విడతలో 7,953 మందికి నోటీసులు పంపగా..7,354 మంది రీ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. 599 మంది గైర్హాజరయ్యారు. మిగిలిన 37,867 మందికి రీ వెరిఫికేషన్ చేయాల్సి ఉంది.


18 మంది వైద్యులతో రీ వెరిఫికేషన్

పింఛన్ రీ వెరిఫికేషన్‌కు కర్నూలు జిల్లా నుంచి 18 మంది వైద్యులను కేటాయించారు. ఇందులో ఏడుగురు ఆర్థో స్పెషలిస్టులు, ఏడుగురు కంటివైద్య నిపుణులు, ఇద్దరు ఈఎన్‌టీ, ఇద్దరు సైక్రియాటిక్ డాక్టర్లు ఉన్నారు. మంగళ, బుధ, గురువారాల్లో గుర్తించిన ప్రభుత్వాసుపత్రులలో రీ వెరిఫికేషన్ చేయనున్నారు. ఇందుకు డీఆర్‌డీఏ-వెలుగు నుంచి 10 మంది ఏపీఎంలతో పాటు సిబ్బందిని కేటాయించారు.

జిల్లాలో 7 ఆసుపత్రుల ఎంపిక

పింఛన్‌దారుల రీ వెరిఫికేషన్ కోసం జిల్లాలో 11 ప్రభుత్వ ఆసుపత్రులను ఎంపిక చేశారు. ఇందులో అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం ఏరియా ఆసుపత్రులు, కళ్యాణదుర్గం, శింగనమల, ఉరవకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఎంపిక చేశారు. అనంతపురం సర్వజన ఆసుపత్రిలో ఉమ్మడి జిల్లాకు చెందిన మానసిక వికలాంగులు, ఈఎన్‌టీ కేటగిరితో పాటు ఆర్థో కేటగిరి పింఛన్‌దారుల రీ వెరిఫికేషన్ జరుగుతోంది. గుంతకల్లులో అంధులు, ఆర్థో కేటగిరి పింఛన్‌దారుల వెరిఫికేషన్ చేస్తున్నారు. మిగిలిన ఆసుపత్రుల్లో ఆర్థో కేటగిరి దివ్యాంగులకు మాత్రమే వెరిఫికేషన్ చేస్తున్నారు.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం



పింఛన్ రీ వెరిఫికేషన్‌లో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినా, మభ్య పెట్టినట్లు మా దృష్టికి వచ్చినా సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. పింఛన్‌దారులు ఎవరూ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా అడిగితే మా దృష్టికి తీసుకురండి. కచ్చితంగా మీకు న్యాయం చేస్తాం. రీ వెరిఫికేషన్ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరుగుతోంది. ఈనెల 11 నుంచి రీ వెరిఫికేషన్ పునఃప్రారంభిస్తాం. అర్హత ఉన్న పింఛన్‌దారులకు కచ్చితంగా న్యాయం జరుగుతుంది. - **ఈశ్వరయ్య, పీడీ, డీఆర్‌డీఏ-వెలుగు**

మహిళ మృతిపై వివాదం

ఆస్పత్రివద్ద బంధువుల ఆందోళన



నూర్జహాన్(ఫైల్),



డాక్టర్ చాంబర్ వద్ద బంధువుల నిరసన

గుంతకల్లు టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా నూర్జహాన్(42) అనే మహిళ మృతి చెందారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పట్టణంలోని శ్రీవేద ఆస్పత్రి వద్దకు శనివారం రాత్రి మృతదేహాన్ని తీసుకువచ్చి బైఠాయించారు. బాధితులు తెలిపిన మేరకు, పట్టణంలోని గంగానగర్‌కు చెందిన వన్నూర్‌వలి భార్య నూర్జహాన్‌కు పుండు అయింది. ఆమెను గురువారం సాయంత్రం శ్రీవేద ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ఆమెకు శుక్రవారం ఆపరేషన్ చేశారు. పరిస్థితి విషమంగా ఉందని, కర్నూలుకు తీసుకువెళ్లాలని శనివారం ఉదయం సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ సాయంత్రం నూర్జహాన్ మృతిచెందారు. డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి నిర్లక్ష్యంతోనే నూర్జహాన్ మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించారు. టూటౌన్ పోలీసులు వెళ్లి వైద్యుడు, బాధితులతో చర్చలు జరిపారు. కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. దీనిపై డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి వివరణ కోరగా, నూర్జహాన్ రెండు రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చారని తెలిపారు. ఆమెకు నడుము వద్ద పుండు అయిందని, కీళ్ల నొప్పులు, గుండె జబ్బుతో బాధపడుతున్నారని అన్నారు. పుండు ఇన్ఫెక్షన్ అయిందని, చికిత్స చేస్తామని చెప్పామని, అవసరమైతే కర్నూలు పెద్దాసుపత్రికి వెళ్లాలని సూచించామని అన్నారు. ఆమె మృతితో తమ నిర్లక్ష్యం లేదని అన్నారు.



ఇఫ్తార్	సెహరీ
6.30	5.15
ఆదివారం సాయంత్రం	సోమవారం ఉదయం



ఉష్ణోగ్రతలు
శనివారం

గరిష్ఠం	39.0
కనిష్ఠం	20.0

అబ్బేదొడ్డిలో చైన్ స్నాచింగ్


తెగిన బంగారు గొలుసు

గుత్తిరూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బేదొడ్డిలో శనివారం తెల్లవారుజామున చైన్ స్నాచింగ్ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఇంటి ఎదుట పని చేసుకుంటున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మెడలోని బంగారం చైన్‌ను లాగాడు. అయితే ఆమె అప్రమత్తమై చైన్‌ను గట్టిగా పట్టుకోవడంతో అది రెండు భాగాలుగా తెగిపోయింది. ఆమె కేకలు వేయడంతో దొరికిన ముక్కతో దుండగుడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బేల్దారి మృతి


మృతి చెందిన రవి

గుత్తిరూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామ శివారు 67వ జాతీయ రహదారిపై శనివారం అనుమానాస్పద స్థితిలో బేల్దారి రవి(36) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గుంతకల్లు పట్టణంలోని ఉమామహేశ్వరనగర్‌కు చెందిన రవి బేల్దారి పని చేసుకుంటూ జీవించేవాడు. గుత్తికి చెందిన యువతితో ఇతడికి వివాహం జరిగింది. అయితే ఆమె ఆరు నెలల కిందట భర్తను వదిలి పుట్టింటికి వెళ్లింది. పని నిమిత్తం బయటకు వెళ్తున్నానని శుక్రవారం రాత్రి రవి తల్లిదండ్రులకు తెలిపాడు. ఉదయం శ్రీపురం వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో బేల్దారి రవిగా గుర్తించి కుటుంబ సభ్యులు, బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పలు కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీఆర్పీ అదుపులో దొంగ

రూ. 79 వేలు స్వాధీనం


నిందితుడు, స్వాధీనం చేసుకున్న సొమ్ముతో జీఆర్పీ పోలీసులు

గుంతకల్లు, మార్చి8(ఆంధ్రజ్యోతి): రైళ్లల్లో నేరాలకు పాల్పడిన ఓ వ్యక్తిని అనంతపురం జిల్లా రైల్వే పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.79 వేలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్‌లో అరెస్టు వివరాలను సీఐ అజయ్‌కుమార్ తెలియజేశారు. రైల్వే ప్లాట్‌ఫాంలపై అనుమానాస్పదంగా కనిపించిన వారిని విచారించే క్రమంలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. గుంటూరు నగరానికి చెందిన హర్షవర్ధన్ రెడ్డి అనే ఈ వ్యక్తి ఏడో నంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని విచారించామన్నారు. క్రమంలోనే అతడిని రైళ్లల్లో దొంగతనాలకు పాల్పడే వ్యక్తిగా గుర్తించామ న్నారు. అతడిని అరెస్టుచేసి రూ. 79 వేలు, ఒక బంగారు డాలర్, రెండు వెండి పట్టీలు, ఓ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, రిమాండుకు తరలిం చినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలిపై వైసీపీ నాయకుడి దాడి

చెన్నేకొత్తపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలిపై అల్లుడితో కలిసి వైసీపీ నాయకుడు చెన్నేకొత్తపల్లిలో శుక్రవారం దాడిచేయగా.. శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు.. స్థానికంగా ఉన్న జయమ్మ అనే వృద్ధురాలి ఇంటి పక్కనే వైసీపీ నాయకుడు శ్రీనివాసులు రెడ్డి వాటర్ ప్లాంటు ఉంది. అందులో నుంచి వృథా నీరు వృద్ధురాలి ఇంటి ముందు నుంచి వెళ్తోంది. నీరు నిల్వ ఉండి ఇబ్బందికరంగా ఉందని, పైపులు ఏర్పాటు చేసుకుని పక్కకు తరలించుకోవాలని వృద్ధురాలు తెలిపింది. దీంతో ఆగ్రహానికి గురైన శ్రీనివాసులురెడ్డి, అల్లుడు మురళీధర్‌రెడ్డితో కలిసి వృద్ధురాలిని దుర్భాషలాడుతూ దాడి చేశారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగమేళా

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పలు కంపెనీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఈనెల 10వతేదీన ఆర్టీటీ స్టేడియం ఎదురుగా ఉప్పరపల్లి రోడ్డులోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఎల్అండ్‌టీ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీ, ముత్తూట్‌ఫైనాన్స్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంకాం చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 8121717846ను సంప్రదించాలని తెలిపారు.

టీటీసీ ఫలితాలు విడుదల

అనంతపురం విద్య, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): టీటీసీ థియరీ-2024 లోయర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయయని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 27న నిర్వహించిన పరీక్షలు ఫలితాలు ఈ నెల 7న విడుదలయ్యాయన్నారు. ఫలితాలు http-s://www.bse.ap.gov.in సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లు త్వరలో డైరెక్టర్ కార్యాలయం నుంచి జిల్లాకు వస్తాయన్నారు. సర్టిఫికెట్లు రాగానే విద్యార్థులకు సమాచారం ఇస్తామని తెలిపారు.

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 240 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నా రు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.


బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు


అంకురార్పణ (ఫైల్)

నేటి నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

కదిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన కదిరి లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. అంకుర్పారణతో మొదలై ఈనెల 23న పుష్పయాగోత్సవంతో ముగుస్తాయి. కాటమరాయుని తిరునాళ్లను కన్నులారా వీక్షించేందుకు కదిరి ప్రాంతనుంచేకాకుండా చుట్టుపక్కల జిల్లాలతోపాటు కర్ణాటక రాష్ట్రంనుంచి లక్షలాది మంది తరలివస్తారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యంగా కల్యాణోత్సవం, మోహిని ఉత్సవం, గరుడసేవ, బ్రహ్మ రథోత్సవం, తీర్థవాది ముఖ్యమైనవి. శ్రీవారి బ్రహోత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటితో పాటు ఉచిత భోజన సదుపాయాన్ని ఆలయంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రేపు కదిరికి నారా లోకేశ్

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెల్లడి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈనెల 10న కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడానికి వస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. శనివారం వీవీఆర్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 10న జరగనున్న కల్యాణోత్సవానికి లోకేశ్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఆయన పట్టువస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. కదిరి నియోజకవర్గంలో జరిగే అత్యంత ప్రతిష్టాత్మకమైన బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు ఇవ్వడం టీడీపీ ప్రభుత్వంలోనే ప్రారంభించామని గుర్తు చేశారు. ఉత్సవాలను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని కోరారు. యువత పెద్దఎత్తున ఉత్సవాల్లో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు ఉండకూడదని అన్నారు. భక్తులకు అసౌకర్యం కలిగితే ఈఓ, ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాని తెలిపారు. పోలీస్ శాఖ ఫ్రెండ్లీగా విధులు నిర్వర్తించాలన్నారు. ఆర్డీవో వీవీఎస్ శర్మ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. హిందూపురం రోడ్డులో ఉచితంగా మినీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషన్ కిరణ్‌కుమార్, ఈఓ శ్రీనివాసరెడ్డి, సీఐ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల్లో పండ్ల తోటల దగ్ధం


పెనకచర్లలో ప్రమాద వివరాలను తెలుసుకుంటున్న పోలీసులు

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన అగ్నిప్రమాదాల్లో పండ్ల తోటలు కాలిపోయాయి. గార్లదిన్నె మండలం పెనకచెర్లలో చీనీ చెట్లు, కల్లూరు గ్రామంలో మామిడి చెట్లు, అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లలో దానిమ్మ తోట అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో లక్షల రూపాయల పంట నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. ఏళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంట కళ్లెదుటే అగ్నికి ఆహుతవడంతో రైతులు బోరున విలపించారు.

గార్లదిన్నె/అనంతపురంరూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో చీనీతోటలు కాలిపోయాయి. దీంతో రూ. 15 లక్షలు ఆస్తి నష్టం కలిగింది. పెనకచెర్ల గ్రామానికి చెందిన రైతులు రామాంజనేయులు, అనిల్ తమకున్న పొలంలో చీనీచెట్లు సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈఏడాది దిగుబడి బాగా వచ్చిందని సంబరపడ్డారు. మరో 10 రోజులుంటే కోతకొచ్చాల్సి ఉంది. రామాంజనేయులు సుమారు 600 చెట్లు, రైతు అనిల్ దాదాపు 500 చీనీచెట్లను ఏడేళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అయితే శనివారం మధ్యాహ్నం వీరి తోటలలో మంటలు వ్యాపించి చెట్లను దహించివేశాయి. సుమారు రూ. 15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. జమేదార్ ఫిరోజ్ బాషా సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని బాధిత రైతులతో వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్లూరులో మామిడి చెట్లు ...

కల్లూరు గ్రామంలో విశ్వమూర్తి అనే రైతుకు చెందిన మామిడి చెట్లు శనివారం దగ్ధమయ్యాయి. కొండకింద కొట్టాల సమీపంలో రైతు విశ్వమూర్తి మామిడి పంట సాగు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సుమారు 15 మామిడి చెట్లు కాలిపోవడంతో రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

తాటిచెర్లలో దానిమ్మతోట..

అనంతపురం రూరల్ మండలంలోని తాటిచెర్లలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో దానిమ్మతోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన బ్యాళ్ల లక్ష్మీనారాయణ మూడు ఎకరాల్లో నాలుగేళ్ల కిందట దానిమ్మ సాగు చేశారు. దాదాపు 1200 చెట్లు పెంచుతున్నాడు. అయితే శుక్రవారం సాయంత్రం పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి వెలువడిన నిప్పురవ్వలతో మంటలు వ్యాపించి తోట కాలియింది. దానిమ్మ చెట్లతో పాటు, తోటలోని బోరు బావి వద్దనున్న పైపులైన్, స్టార్టర్ పెట్టె, కేసింగ్ వైరు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.4లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.


తాటిచెర్లలో కాలి పోయిన దానిమ్మ తోట

ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య


తరుణ్ (ఫైల్)

ఓబుళదేవరచెరువు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని గాజులవారిపల్లి గ్రామానికి చెందిన పల్లపు ఈశ్వరప్ప ఏకైక కుమారుడు పల్లపు తరుణ్ (20) శనివారం సాయంత్రం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన మేరకు నాలుగు నెలల కిందట పేరంవాడ్లపల్లికి చెందిన నీరుగొట్టి నరసింహులు అనే వ్యక్తి తరుణ్‌పై పోలీస్ కేసు పెట్టాడు. ఆరోజు నుంచి తన కుమారుడు ఈ కేసు విషయంగా బాధపడుతుండేవాడని తండ్రి ఈశ్వరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలోనే మనస్తాపం చెందిన అతను ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. తరుణ్ ఓడీచెరువులోని వెంకటసాయి ఐటీఐలో ఎలక్ట్రీషియన్ రెండో సంవత్సరం చదువుతున్నట్లు చెప్పారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. తన కుమారుడి మృతికి కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం రాత్రి శవంతో బంధువులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు.

డాలీ ఉద్యోగ విరమణ

పోలీసు జాగిలానికి ఎస్పీ సత్కారం


హ్యాండ్లర్‌కు మెమెంటో అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖకు జాగిలం డాలీ అందజేసిన సేవలు మరువలేనివని ఎస్పీ జగదీష్ అన్నారు. పదకొండేళ్లపాటు సేవ లందించిన డాలీ శనివారం బాధ్యతల నుంచి విరమణ పొందింది. ఈ సందర్భంగా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డాలీని ఎస్పీ సత్కరించారు. డాలీ హ్యాండ్లర్ నాగభూషణను అభినందించి, జ్ఞాపికను అందజేశారు. 2014లో ఆరు నెలల వయస్సు ఉన్నప్పుడు ఈ జాగిలాన్ని అనంతపురం జిల్లాకు కేటాయించారు. హత్యలు, దోపిడీలు, దొంగతనాలు తదితర నేరాల ఛేదింపులో డాలీ క్రియాశీలక పాత్ర పోషించింది. దాదాపు 300 నేర ప్రదేశాల్లో తనిఖీలలో పాల్గొంది. చెప్పుకోదగ్గ 30 నేరాల ఛేదింపునకు సహకరించింది. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్‌బాషా, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

5,857 కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 5,847 కేసులకు న్యాయాధికారులు పరిష్కారం చూపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 24 బెంచులు నిర్వహించారు. రాజీ పడదగిన 886 క్రిమినల్ కేసులు, 80 సివిల్ కేసులు, 48 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, 388 ప్రీ లిటిగేషన్ కేసులకు పరిష్కారం దక్కింది. ప్రమాద కేసులలో రూ.3,83,82,000 కక్షిదారులకు పరిహారం ఇప్పించారు. సివిల్ కేసులలో రూ.2,82,11,464 పైగా, ప్రీ లిటిగేషన్ కేసులలో రూ.68,80,800 ఇప్పించారు. జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పర్యవేక్షించారు.

చీనీ టన్ను రూ. 24వేలు

అనంతపురం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 404 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అన్నింటా రాణింపు

నారీమణి చిత్రాన్ని అద్భుతంగా గీసిన ఉపాధ్యాయుడు



రామగిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీరాములు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నారీమణి చిత్రాన్ని చిత్రీకరించారు. నేటి సమాజంలో మహిళ అన్ని రంగాల్లో రాణిస్తోందని చూపుతూ స్త్రీని తల్లిగా , వ్యాపారవేత్తగా, వైద్యురాలిగా, ఉపాధ్యాయురాలిగా, క్రీడలు, వ్యాయామ విభాగాల్లో సైతం మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని చాటి చెబుతూ రంగుల్లో ఓ చిత్రాన్ని అద్భుతంగా గీశారు. దీన్ని చూసిన తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీరాములు మాస్టారును అభినందించారు.

ఆడబిడ్డను పుట్టనిద్దాం... ఎదగనిద్దాం: డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష లేకుండా ప్రతి ఆడబిడ్డను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం అని డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి పిలుపునిచ్చారు. జిల్లావైద్యశాఖ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లోనూ అభివృద్ధిపథంలో నడుస్తున్నారన్నారు. ఎలాంటి సమస్యలకు భయపడకుండా పనిచేయాలని మహిళా వైద్య ఉద్యోగులకు సూచించా రు. కార్యక్రమంలో ఏఓ గిరిజా మనోహర్, డెమోలు త్యాగరాజు, గంగాధర్, మహిళా ఉద్యోగులుపాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

అనంతపురం విద్య, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులను శనివారం డిబార్ చేశారు. జనరల్ విద్యార్థులు 20,313 మందికి గాను 19,829 మంది హాజరు కాగా 484 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,438 మందికిగాను 2301 మంది హాజరు కాగా 137 మంది గైర్హాజరయ్యారు. అనంతపురం పట్టణంలో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా డిబార్ చేశారు. అనంతపురంలోని శ్రీసత్యసాయి బాలికల జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఆర్ఐఓ వెంకటరమణ 4 కేంద్రాలను, కమిటీ సభ్యులు 4 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10 కేంద్రాలను, కస్టోడియన్లు 13 కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం 621 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలతో పాటు వివిధ రాజకీయపార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. మహిళాశక్తి గొప్ప తనం, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాల్సిన ఆవశ్యకత గురించి ఆయా కార్యక్రమాల్లో వక్తలు ప్రసంగించారు. మండలకేంద్రాల్లోనూ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వంలోనే మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించగలరని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అనంతపురం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళలు, మహిళా ఉపాధ్యాయుల తో కలిసి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ నాయకురాలు బండారు లీలావతి కేక్ కట్ చేసి మహిళలకు శుభాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి బాటలు వేసింది టీడీపీనే అన్నారు. పొదుపు సంఘాలతోనే మహిళల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అమ్మలదిన్నె షాలినిదొర, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

సైకో ప్రకాష్‌రెడ్డీ... నోటికొచ్చినట్లు మాట్లాడితే ఎలా..?

● ఎమ్మెల్యే పరిటాల సునీత



పేదలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సైకో ప్రకాష్‌రెడ్డీ.. అధికారంలో ఉన్నప్పుడు పేరూరు ప్రాజెక్టుకు నీరు ఇచ్చే పనులు చేయకుండా ఇప్పుడు నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఎలా..? అని ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపడ్డారు. శనివారం అనంతపురం నగరంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు చెందిన 30 మందికి రూ.33.32 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పరిటాల సునీత అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... పేదలకు కష్టం ఉందంటే, క్షణం కూడా ఆలోచించకుండా సీఎం చంద్రబాబు సాయం చేస్తున్నారన్నారు. రేషన్‌కార్డులు, కొత్త పించన్ల ఇప్పించాలని ప్రజలు కోరుతున్నారని, ఈ విషయంపై సంబంధిత మంత్రిని కలిశామన్నారు. త్వరలోనే కొత్తవి అందిస్తామన్నారు. ఇదే క్రమంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. నోరు ఉందని, చేతిలో సెల్ ఫోన్ ఉందని ఏదిబడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. గత ఐదేళ్లల్లో పేరూరు ప్రాజెక్టును అటకెక్కించారన్నారు. వర్షపు నీటితో నిండిన ప్రాజెక్టు గేట్లను అవగాహనరాహిత్యంతో ఎత్తి, వాటిని విరగొట్టి మొత్తం నీటిని ఏటిపాలు చేశావన్నారు. అటువంటి నీవా ఈ రోజు నీతి వాఖ్యాలు వల్లించేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం రోజు... ఒక మహిళగా చెబుతున్నాను... పేరూరు ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయించి, ప్రాజెక్టుకు నీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు నిర్మిస్తామంటూ రాక్రీట్ సంస్థ పేరుతో దోపిడీ చేసింది నిజం కాదా అని నిలదీశారు. సొంతింటి కల నెలవేర్చుకోవలని ఎదురుచూస్తున్న పేదలను మోసం చేశారన్నారు. తాము ఇళ్లు లేని ప్రతి నిరుపేదకు కచ్చితంగా ఇళ్లు మంజూరు చేసి తీరుతామన్నారు. ప్రకాష్‌రెడి అవినీతి లెక్కలు కూడా త్వరలోనే తేలుతాయని ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు.

జాబితాలో అభ్యంతరాలు తొలగించండి

● డీఈఓకు వినతుల వెల్లువ



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య మార్చి 8(ఆంధ్రజ్యోతి) : టీచర్ల సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు తొలగించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఆ సంఘం నాయకులు శనివారం సైన్స్ సెంటర్‌లో డీఈఓను కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోవిందరాజు, ప్రధానకార్యదర్శి లింగమయ్య, ఇతర నేతలు మాట్లాడుతూ...జాబితాల్లో కొందరు టీచర్ల పేరు కనిపించడంలేదన్నారు. టిస్ డేటాకు భిన్నంగా లిస్టులో వివరాలు ఉన్నాయన్నారు. సీనియారిటీలో వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. చాలా మంది సీనియర్ల కంటే జూనియర్లు ముందు వరుసలో ఉన్నారని తెలిపారు. టీచర్ల హాల్ టికెట్లు, మార్కులు, ర్యాంకులు, రోస్టర్ తదితర వివరాలు తెలియకపోవడం వల్లే ఇలాంటి తప్పులు ఎక్కువ జరిగి ఉంటాయన్నారు. తప్పులు సవరించాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు రమణయ్య, చంద్రమోహన్, నాగేంద్ర, ఆదిశేషయ్య, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌టీఏ నేతల వినతి : తెలుగు, హిందీ, కన్నడ, ఉర్దూ, సంస్కృతం టీచర్ల సీనియారిటీ జాబితాలో పొరపాట్లు ఉన్నాయని ఎస్ఎల్‌టీఏ, ఆపస్ నాయకులు డీఈఓకు తెలిపారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఆదిశేషయ్య, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, తులసీదాస్, సాయిప్రసాద్, ఆపస్ నాయకులు రాజేంద్రప్రసాద్, ఎర్రిస్వామి, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

డీడీఓలకు ఎడిట్ అవకాశం ఇవ్వాలి

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో అనేక పొరపాట్లు ఉన్నాయని, చాలా గందరగోళం ఉందని, మరోసారి డీడీఓలకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1994 నుంచి ఇప్పటి వరకూ జరిగిన డీఎస్సీల వారీగా ర్యాంకులు, రోస్టర్ మెరిట్ లిస్టులను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచాలన్నారు. టీచర్లు అనంతపురానికి వచ్చి తప్పుల సవరణకు వినతులు ఇవ్వడం ఇబ్బందిగా మారిందన్నారు. వినతులు ఇవ్వడానికి సత్యసాయి జిల్లాలోనూ కౌంటర్లు ఏర్పాటుచేయాలని కోరారు.

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చవద్దు: ఏఐబీఎస్ఎస్

అనంతపురం కల్చరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని అఖిల భారత బంజారా సేవా సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రే నాయక్ డిమాండ్ చేశారు. రెండో రోడ్డులోని బంజారా భవన్‌లో ఏఐబీఎస్ఎస్ నాయకులతో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వాల్మీకి బోయలు వెనుకబడిన వర్గాలుగా ఉన్నారని, వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో ప్రతిపాదించడాన్ని ఏఐబీఎస్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఇపుడిపుడే గిరిజనులు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధివైపు నడుస్తున్నారని, ఇలాంటి తరుణంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రతిపాదన సరికాదని అన్నారు.

ఆర్ఈఎఫ్ నాయకుడిపై కేసు కొట్టివేత

అనంతపురం సెంట్రల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో తనపై అక్రమంగా పెట్టిన కేసు కొట్టివేశారని ఆర్ ఈఎఫ్ నాయకులు డాక్టర్ ఎండీ నాగభూషణం శనివారం తెలి పారు. న్యాయవాది సాకే నరేష్ కేసును వాదించారని తెలిపారు.

11న మండల సమావేశం

శింగనమల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 11న తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉయం 11గంటలకు నిర్వహిస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

కేఎస్ఎన్ కళాశాల అభివృద్ధికి కృషిచేస్తా: ఎంపీ



అగిపోయిన భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం సెంట్రల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆగిపోయిన హాస్టల్ భవన నిర్మాణాలను పూర్తి చేయించేందుకు తన వంతు కృషిచేస్తామనని ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. ఆయన శనివారం కళాశాలను సందర్శించి సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యలత, అధ్యాపకులు రామాంజినేయులు, రమణానాయుడు, ఆదినారాయణ, అంజనారెడ్డి, రమేదేవి, లక్ష్మి, మణిమాల, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పైపు లైన్ పనులను పరిశీలించిన కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఇంటింటా గ్యాస్ లైన్ పనులను కలెక్టర్ వినోద్‌కుమార్ శనవారం పరిశీలించారు. జిల్లాకేంద్రంలోని అరవిందనగర్‌లో పైపులైన్ ఏర్పాటుకు జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఇంటింటా గ్యాస్ సరఫరా పనులు ఎక్కడెక్కడ చేపడుతున్నారు? ఇంతవరకు ఎంత మేర పూర్తి చేశారు? ఇంకా ఎంతమేర ఏయాల్సి ఉంది? ఎప్పటికి పూర్తి చేస్తారు? తదితర వివరాలపై కంపెనీ ప్రతినిధులు, నగరపాలక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటికే గ్యాస్ అందించాలని ప్రభుత్వం ఈప్రక్రియ చేపట్టిందని, పకడ్బందీగా త్వరగా పనులు పూర్తిచేయాలని కలెక్టరు ఆదేశించారు.

'పది' విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



పదోతరగతి విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

అనంతపురం కల్చరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆజాద్‌నగర్ లోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం పదోతరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. శాస్త్రోక్తంగా సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం పబ్లిక్ పరీక్షల్లో పాటించాల్సిన మెళకువలు, నిబంధనలను విద్యార్థులకు వివరించడంతోపాటు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గురుప్రసాద్, హెచ్‌ఎంలు కృష్ణవేణి, అనిత, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో అనంత కళాకారుల ప్రదర్శన



స్వర్ణ రథోత్సవం ఎదుట కోలాటమాడుతున్న కౌసల్య బృందం

అనంతపురం కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో అనంత కళాకారులు ప్రతిభ చాటుకున్నారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో శనివారం స్వర్ణరథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రథోత్సవం ఎదుట నగరానికి చెందిన ఓం సంగీత నృత్య కోలాట శిక్షణాలయం నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య బృందం కోలాటంతోపాటు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. రథోత్సవం అనంతరం ఆలయ ఈఓ శ్రీనివాసులు బృందాన్ని అభినందించినట్లు దేవరకొండ కౌసల్య తెలిపారు.

రాతిదూలం లాగుడు పోటీలు

రాప్తాడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లిలో ఎర్రితాతస్వామి పరుష సందర్భంగా శనివారం నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆలయం వద్ద నిర్వహించిన పోటీలకు పలు ప్రాంతాల నుంచి వృషభాలు హాజరయ్యాయి. ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన రైతు చెన్నప్ప వృషభాలు మొదటి బహుమతి రూ. 25 వేలు గెలుపొందాయి. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మద్దెల చెరువుకు చెందిన రైతు కొండయ్య వృషభాలు రెండో బహుమతి రూ. 20 వేలు గెలుపొందాయి. బహుమతులను టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, రాప్తాడు సీఐ శ్రీహర్ష చేతుల మీదుగా అందజేశారు. పరుష సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఎర్రితాతస్వామిని దర్శించుకుని రాతి దూలం పోటీలను ఆసక్తిగా తిలకించారు.



రాతిదూలం లాగుతున్న వృషభాలు

న్యూస్ బాక్స్

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపల్లిలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు శనివారం భూమి పూజ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్య నారాయణ, ప్రధాన కార్యదర్శి పాములరాయి రఘు, ఎంపీటీసీ నాగరత్నమ్మ, మాజీ ఎంపీటీసీ ఇమామల్, టీడీపీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, అంజన్‌రెడ్డి, మస్తాన్ తదితరులు భూమి పూజ చేశారు. అనంతరం మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలతో కేక్ కట్ చేయించారు.

నియామకం

అనంతపురం అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మత్స్యకార సంక్షేమ సమితి ఏపీ మహిళా అధ్యక్షురాలిగా కోట రాజేశ్వరి నియమితులయ్యారు. ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేశ్వరిని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక మత్స్యకార సంక్షేమ సమితి కార్యాలయంలో రాజేశ్వరికి పలువురు నాయకులు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

ఫీజు పోరును విజయవంతం చేయండి : వైసీపీ

కనగానపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ యూత్ కన్వీనర్ గంగుల సుధీర్‌రెడ్డి పిలుపుని చ్చారు. ఆయన శనివారం కనగానపల్లిలో వైసీపీ నాయకులతో కలసి మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న వైసీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద భారీ ర్యాలీ చేపడుతున్నామని, ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అంకే అశోక్, భాస్కర్, పెద్దిరెడ్డి, సుదాకర్‌రెడ్డి, రమేష్, అమర్నాథరెడ్డి, రవి, నారాయణ, రాజు, కృష్ణారెడ్డి, శీనా తదితరలు పాల్గొన్నారు.

పాతూరులో గుర్తు తెలియని శవం

అనంతపురం క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతూరులో బ్రహ్మంగారి గుడి సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని మగ శవం లభ్యమైంది. సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉన్న అతడు తెల్ల బనియన్, బ్లూ కలర్ డ్రాయర్ ధరించాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9440796804 నెంబర్‌ను సంప్రదించాలని వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు.

రెండో రోజు ఘనంగా కలశపూజ



కలశ పూజ చేసిన దృశ్యం

రామగిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలో జరుగుతున్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు రెండో రోజు శనివారం కొనసాగాయి. కలశ పూజ, హోమాలు తదితర పూజా కార్యక్రమాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల భక్తులు తరలివచ్చారు. ఆదివారం తెల్లవారు జామున ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఎమ్మెల్యే పరిటాలసునీత, టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, టీడీపీ నాయకులు హాజరవుతారని తెలిపారు.

కలుషిత నీరు తాగి 31 గొర్రెలు, మేకల మృతి



మృతి చెందిన గొర్రెలు, మేకలు

నార్పల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లిలో గొరవ గంగప్ప అనే గొర్రెల కాపరికి చెందిన 31 గొర్రెలు, మేకలు కలుషిత నీరు తాగి మృతి చెందాయి. బండ్లపల్లికి చెందిన గొరవ గంగప్ప శనివారం ఉదయం తన గొర్రెల మందను మేత కోసం గ్రామ సమీపంలోని కొం డలు వైపు తోలుకెళ్లాడు. అయితే తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో గొర్రెలు ఆ దారిలోని వ్యవసాయం పొలాల్లో డ్రమ్ములను కిందకు తోసి వాటిలోని నీటిని తాగాయి. అయితే కొందరు రైతులు పంటలకు పిచికారి చేసేందుకు నీటిలో పురుగుల మందు కలిపి ఆ డ్రమ్ముల్లో ఉంచారు. ఆ నీటిని తాగిన వాటిలో 31 గొర్రెలు, మేకలు ఒక్కసారిగా అక్కడికక్కడే కుప్పకూలిపోయి మృతిచెందాయి. మరో 15 గొర్రెల పరిస్థితి విషమంగా ఉందని గంగప్ప తెలిపాడు. గొర్రెల మృతితో దాదాపు రూ. 4లక్షలు నష్టం వాటిల్లిందని గొరవ గంగప్ప వాపోయాడు. ప్రభుత్వం గొర్రెల కాపరిని అదుకోవాలని గ్రామస్థులు కోరారు.

సందడిగా 'శ్రీచైతన్య' జోనల్ స్పోర్ట్స్ మీట్



ట్రోఫీతో ఏజీఎం, ప్రిన్సిపాళ్లు, మెడల్స్‌తో విద్యార్థులు

అనంతపురం విద్య, మార్చి 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఎస్ రావు మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ శ్రీచైతన్య స్కూల్‌లో సందడిగా సాగింది. శనివారం హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిలోని ఏపీటీ-3 స్కూల్ ఆవరణలో నిర్వహించారు. డీటీసీ వీర్రాజు, 4వ పట్టణ ఎస్ఐ రాంప్రసాద్, ఏజీఎం సుబ్బారెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారం భించారు. ఏజీఎం మాట్లాడుతూ...బీఎస్‌రావు శ్రీచైతన్య స్కూళ్లు, కళాశాలలు స్థాపించి ఎందరో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. రెండు తెలుగురాష్ట్రాల్లో కాకుండా దేశంలో అనేక రాష్ట్రాల్లో విద్యాసంస్థలు స్థాపించారన్నారు. డీటీసీ మాట్లాడుతూ...విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సమీనాఖాన్, తబస్సుం, విశ్వనాథ్, శాంత, నేత్రావతి, పర్వీన్, శ్రీదేవి, వెంకటేష్‌కరీం, మురళీకృష్ణ, నరేష్, ఫిలిప్, ఇతర కోఆర్డినేటర్లు, సిబ్బంది, వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అంతటా మహిళల సంబరాలే..



అర్బన్ టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న తెలుగు మహిళలు



ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో



పీవీకేకే కళాశాలలో..



నారాయణ స్కూలులో...



నృత్యం ప్రదర్శించిన మెడికోలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు



సాయివిజ్ఞాన్ స్కూల్‌లో....

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రాప్తాడు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో మరింత రాణించాలని జేఎన్టీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శారద తెలిపారు. మండలంలోని హంపాపురం వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరరు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శర్మ, చైర్మన్ క్రిష్ణారెడ్డి, వైస్ చైర్మన్ రవీంద్రరెడ్డి, ఎండీ రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


అఖిల గాండ్ల తెలిక ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో...



మాట్లాడుతున్న గాండ్ల తెలికల రాష్ట్ర నాయకురాలు విశాలాక్షి

అనంతపురం అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అఖిల గాండ్ల తెలిక ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక విజయనగర లా కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గాండ్ల తెలికల రాష్ట్ర నాయకురాలు విశాలాక్షి మాట్లాడుతూ.. గాండ్ల మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు చిన్నారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శన అలరించింది. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు నరసింహుడు, ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు, కేపీకుమార్, సూర్యనారాయణ, నాగరాజు, మల్లికార్జున, బసవరాజు, పుల్లయ్య, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగర లా కాలేజ్ ఆధ్వర్యంలో...



● అనంతపురం సెంట్రల్ : విజయనగర లా కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్రాచార్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో అధ్యాపకులు నారీజూరి, కల్పన, నిర్మలాదేవి, సోని, అనురాధ, వాసవీలత, జోతిర్మయి, తేజశ్రీ, లక్ష్మి పాల్గొన్నారు.

'కళలను బాల్యం నుంచే అభ్యసించాలి'



చిత్రలేఖనంలో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గార్లదిన్నె, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కళలను చిన్ననాటి నుంచే అభ్యసించడం ఎంతో ఆనందదాయకమని ఆకాశవాణి ప్రోగ్రాం డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శనివారం మర్తాడు ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన బాలవాణి, రేడియో కదంబకార్యక్రమం, చిత్రలేఖనంలో ప్రతిభ చూపిన చిన్నారులకు అభినంద సభ నిర్వహించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రశంస పత్రాలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ -2 వెంకటరమణ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఆకాశవాణి అసిస్టెంట్ ఇంజనీర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కార్యకర్తలకు అండగా ఉంటాం

● టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన కూటమి నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ ఫలాలు అర్హులకు అందజేసేందుకు కుటుంబ సాధికార సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి 30 ఓటర్లకు ఒక సారధిని నియమించి ఆయా కుటుంబాల అర్హతలను గుర్తించాలన్నారు. అప్పుడే సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అర్హులకు అందుతాయని తెలిపారు. ఎన్నికల్లో శ్రమించిన కూటమి నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, ఏపీ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ రమేష్ నాయక్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పూజారి లక్ష్మీదేవి, టీడీపీ మండల కన్వీనర్ ముసలిరెడ్డి, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో, పోలీసు స్టేషన్ పక్కన టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను పార్టీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తాడిపత్రి, మార్చి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతగారిపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ శనగలులో కలిపే మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడని రూరల్ పోలీసులు తెలిపారు. శ్రీకాంత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండురోజులక్రితం స్వగ్రామానికి వచ్చాడు. అయితే శుక్రవారం రాత్రి ఆత్మహత్యాయత్నం పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

బీరపంట ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్ల పంచాయతీ పాత చెరువు గ్రామంలో బీరపంటను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. పాత చెరువుకు చెందిన రమేష్ తనకున్న ఐదు ఎకరాల పొలంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో బీర పంట సాగుచేశాడు. పంట దిగుబడి అత్యధికంగా రావడంతో తోట మొత్తం బీర పంటకు పందిరి ఏర్పాటు చేశాడు. అయితే ఇది ఓర్వలేక కొందరు గుర్తుతెలియని దుండగులు పంట మొత్తం నేలమట్టం చేశారు. దీంతో దాదాపు రూ. పది లక్షలు వరకు నష్టం కలిగిందని బాధిత ఆవేదన వ్యక్తం చేశాడు. ధ్వంసమైన పంటను టీడీపీ మండల కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, సర్పంచ్ కవితా బొజ్జన్న, రూరల్ పోలీసులు శనివారం పరిశీలించారు.

లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

తాడిపత్రి, మార్చి8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లోక్ అదాలత్‌ను జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణవేణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మొత్తం 261క్రిమినల్, సివిల్ కేసులు పరిష్కారమయ్యాయని న్యాయవాది అనిఫ్‌బాషా తెలిపారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో 226 కేసులు పరిష్కరించినట్లు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీధర్ తెలిపారు.

గుత్తి: పట్టణంలోని కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో 210 కేసులను పరిష్కరించారు. అరవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీహరి, జూనియర్ సివిల్ న్యాయమూర్తి శ్వేత, బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీడీ రత్నం, ఏపీపీ భూసాసుధీర్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ నిర్వహించి 167 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి దుర్గాకల్యాణి తెలిపారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోండి

పుట్లూరు, మార్చి, 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని మండల టీడీపీ నాయకుడు పుట్లూరు పుల్లారెడ్డి కోరారు. అనంతపురంలో శనివారం ఆయన ఎమ్మెల్యేను కలిసి తాగునీటి సమస్యపై విన్నవించారు. ఎండలు రోజురోజుకూ అధికమవుతుండడంతో బోర్లలో నీరు అడుగంటిపోయే అవకాశం ఉందన్నారు. గండికోట పైప్‌లైన్ పూర్తిచేస్తే సమస్య తగ్గుతుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

పెద్దవడుగూరు, మార్చి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు, చిట్టూరు గ్రామ సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 3ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు.

నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారు

● మాజీమంత్రి ఉషశ్రీ చరణ్‌పై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విమర్శ

కళ్యాణదుర్గం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో మంత్రిగా ఉన్న ఉషశ్రీ చరణ్ కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే సురేంద్రబాబు విమర్శించారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలకు సన్మానం చేసి మెమొంటోలను అందజేశారు. తర్వాత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఉషశ్రీ చరణ్ దుర్మార్గపు పాలన చేసి నియోజకవర్గాన్ని అధోగతి పాల్జేశారన్నారు. మహిళ అయి ఉండి కూడా ఎంతో అధ్వానపు పాలన కొనసాగించారన్నారు. ఆమెను ఎవరూ ఆదర్శంగా తీసుకోరాదని ఈ సందర్భంగా సూచించారు. మహిళలకు సమాన హక్కులు కల్పించినది టీడీపీనేనని, ఇప్పటికీ అసెంబ్లీలో 40 మందికి పైగా మహిళా ఎమ్మెల్యేలు ఉన్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో యువతకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, అలాగే బీసీ మహిళకు మన ప్రాంత మార్కెట్ యార్డు చైర్మన్‌గా అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

● పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

యాడికి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. చెన్నకేశవస్వామి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలను నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఉత్సాహంగా కొనసాగిన కబడ్డీ పోటీల్లో యాడికి లియో టీం మొదటి బహుమతిగా రూ. 50 వేలు, అయ్యవారిపల్లికి చెందిన జట్టు రెండో బహుమతిగా రూ.40 వేలు, అనంతపురానికి చెందిన వివేకానంద జట్టు మూడో బహుమతిగా 30 వేలు, యాడికి ప్రశాంత్ టీం నాలుగో బహుమతిగా రూ.20వేలను గెలుపొందాయి. నగదు బహుమతులను, ట్రోఫీలను నిర్వాహకులు అందజేశారు. బహుమతుల దాతలు తిరంపురం నీలకంఠ, విశ్వం, వెంకటరమణ, రమేష్, కుబేర అండ్ సన్స్, నాగమయ్య, నీలూరు చంద్రశేఖర్, కడ్డీల నాగేంద్ర, సునీల్, బ్రహ్మోత్సవాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

శివలక్ష్మీ చెన్నకేశవస్వామిని ఎమ్మెల్యే దర్శించుకుని పూజలు చేయించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై పర్యవేక్షకులను ఆరాతీశారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, జనసేన మండల కన్వీనర్ సునీల్‌కుమార్ ఉన్నారు.

మహిళా దినోత్సవానికి హాజరు

మండలకేంద్రంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళలు కుటుంబ పాలన నుంచి రాజకీయం వరకు ధీటుగా రాణిస్తున్నారని ప్రశంసించారు.

తాగునీటి సమస్య పరిశీలన

యాడికిలోని పిన్నేపల్లి హౌసింగ్ లేఔట్ లో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే పరిశీలించారు. సమస్య పరిష్కారంపై అధికారులను ఆరాతీశారు. వీలైనంత తొందరగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ఘనంగా ముత్యాలపల్లకి మహోత్సవం

రాయదుర్గం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో మద్దానేశ్వరస్వామి ముత్యాలపల్లకి మహోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ముందుగా అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై కొలువుదీర్చి ఊరేగింపు చేశారు. నందికోళ్ల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నాయి.



వెండిరథంపై స్వామి వారు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

● రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రాంభూపాల్ డిమాండ్

కూడేరు, మార్చి, 8(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని, దీంతో చాలామంది పొలాల్లోనే పంటను నిల్వ చేసుకుంటున్నారని, తక్షణమే ప్రభుత్వం పంటలను కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్న డిమాండ్‌తో ఏపీ రైతు సంఘం తలపెట్టిన పాదయాత్ర రెండో రోజైన శనివారం కూడేరు మండలంలో సాగింది. ఉదయం శివారంపేట నుంచి మొదలైన పాదయాత్ర ఉదిరిపికొండ, జల్లిపల్లి గ్రామాల మీదుగా ముద్దలాపురం గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా రాంభూపాల్ ఆయా గ్రామాల్లో రైతులతో పంటలు గూర్చి, గిట్టుబాటు ధర గూర్చి అడిగి తెలుసుకున్నా రు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో అత్యధికంగా బ్యాడిగ మిరప, వేరుశనగ, పప్పుశనగ, జొన్న తదితర పంటలతో పాటు హార్టికల్చర్ పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. అయితే గిట్టుబాటు ధర లేక అన్నదాతలు అప్పుల పాలవుతున్నారన్నారు. విడపనకల్లు, ఉరవకొండ, కూడేరు తదితర మండలాల్లో బ్యాడిగ మిరప సాగు చేస్తున్నారని, గిట్టుబాటు ధర లేక పోవడంతో రెండేళ్లుగా నిల్వలు పెరిగిపోయాయని చెప్పారు. ఈ పంటలను ఎక్కువ మంది కౌలు రైతులు సాగు చేసి నష్టపోయారని, ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో వారు నట్టేట మునిగిపోయారని అన్నారు. జొన్న సాగు చేసిన రైతులు ధర పూర్తిగా పడిపోవడంతో పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితి నెలకొందన్నారు. ఇక హార్టికల్చర్ పంటలను అమ్ముకోవడానికి సరైన మార్కెట్ సౌకర్యం లేదని, దీంతో దళారీల వ్యవస్థ పెరిగిపోయి రైతులు నష్టపోతున్నారని వాపోయారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, పంటలను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని, మార్కెట్ సౌకర్యం కల్పించాలని రాంభూపాల్ కోరారు. పాదయాత్రకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకుడు తరిమెల నాగరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, ఇతర నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పాదయాత్రలో రైతు సంఘం నాయకులు, రైతులు

రేషన్ బియ్యం పట్టివేత

బొమ్మనహాళ్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహోన్నూరు గ్రామం వద్ద రేషన్ బియ్యంను కర్ణాటకకు తరలిస్తుండగా అనంతపురం విజిలెన్స్ అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు విజిలెన్స్ సీఐ జమాల్ బాషా తెలిపారు. వెంకటేశులు అనే వ్యక్తి గ్రామాల్లో ప్రజల నుంచి రేషన్ బియ్యం సేకరించి కర్ణాటకకు తరలిస్తుండగా.. సమాచారం అందిందని, వెంటనే విజిలెన్స్ అధికారులు దాడులు చేసి గ్రామ శివారులో బొలెరో వాహనం తనిఖీ చేసి అందులోని 55 బస్తాల్లో 27.6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారని చెప్పారు. వీఆర్వో రామన్న సమక్షంలో వాహనాన్ని సీజ్ చేసి వెంకటేశులపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఇసుక డంప్‌లు సీజ్

డీ.హీరేహాళ్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని ఇసుక డంప్‌లను శనివారం పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. మండలంలోని హిర్దేహాళ్ గ్రామ సమీపంలో ప్రతిరోజూ పగటి పూట కొంతమంది ట్రాక్టర్ యజమానులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకువచ్చి అటవీప్రాంతంలోని రెండు, మూడు చోట్ల డంప్ చేసి అక్కడి నుంచి రాత్రి సమయాల్లో టిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ఇసుక డంప్‌లను గుర్తించి వెంటనే సీజ్ చేశారు. డంప్ చేసిన వారిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

మృతురాలు రాంపురం గంగమ్మ

బెళుగుప్ప, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జీడిపల్లి రిజర్వాయర్‌లో శుక్రవారం లభ్యమైన గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యమైన విషయం విదితమే. అయితే ఆ మృతురాలు ఉరవకొండ మండలం రాంపురం గ్రామానికి చెందిన గంగమ్మగా గుర్తించినట్లు ఎస్ఐ శివ శనివారం తెలిపారు. మృతురాలు మతిస్థిమితం లేకుండా ఒంటరిగా తిరుగుతుండేదని, ఈ నెల 4వ తేదీ హంద్రీనీవా కాలువ వైపు వెళ్లినట్లు గ్రామస్థులు గమనించారని, ప్రమాదవశాత్తుఅందులో జారిపడి వుంటుందని చెప్పారు. బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చామని అన్నారు.



గంగమ్మ (ఫైల్)

దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు మహిళా లబ్ధిదారులు టైలరింగ్ శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్ శనివారం ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సంబంధిత సచివాలయంలో తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నియోజకవర్గం వారిగా టైలరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తారన్నారు. అవకాశాన్ని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు మహిళా లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా బసవేశ్వర వాహనోత్సవం

ఉరవకొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గవిమఠస్థిత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి బసవేశ్వర వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని అలంకరించి బసవేశ్వర వాహనంపై కొలువుదీర్చి మేళతాళాల మధ్య అశేష భక్తజనం నడుమ గవిమఠం నుంచి ఎదురుబవన్న గుడి వరకూ ఊరేగించారు. పీఠాధిపతి చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, ఆదోని చౌకిమఠం కల్యాణస్వామి, గవిమఠం సహాయ కమిషనర్ రాణి, గవిమఠం సిబ్బంది పాల్గొన్నారు.



బసవేశ్వరవాహనంపై దర్శనమిస్తున్న స్వామి వారు

షటిల్ టోర్నీ నిర్వహణ

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ఎస్కేఆర్సీ క్లబ్ ఆధ్వర్యంలో షటిల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలను గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి ప్రారంభించారు. మొత్తం 21 టీమ్‌లు పాల్గొని హోరాహోరీగా తలపడ్డాయి.

నేడు రథోత్సవం

గవిమఠ స్థిత చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మహారథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో గవిమఠం అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు గవి మఠం సహాయ కమిషనర్ రాణి తెలిపారు.

ఆహార పదార్థాల కల్తీపై దృష్టి సారించాలి: సీపీఐ

గుంతకల్లు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పెచ్చుమీరిపోతున్న ఆహార పదార్థాల కల్తీని ప్రభుత్వం నియంత్రించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ జగదీశ్ కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గంలోని బండమీదపల్లి గ్రామంలో ఇటీవల పాల కల్తీదారులు పట్టుబడ్డారని, పాల కల్తీ అన్ని పట్టణాల్లోనూ కొనసాగుతోందని అన్నారు. పురపాలక సంఘాలు ఆహార పదార్థాల కల్తీపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. స్థలాలు, ఇంటి రుణాల కోసం అర్హులు జిల్లా వ్యాప్తంగా తమ పార్టీ ఆధ్వర్యంలో దాదాపు లక్ష దరఖాస్తులను సమర్పించారని, కానీ వాటిపై ఇంతవరకు విచారణ జరపలేదని అన్నారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు బీ గోవిందు, వీరభద్రస్వామి, బీ మహేశ్, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీ జగదీశ్

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

రాయదుర్గంరూరల్/ బెళుగుప్ప మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్రవన్నూరు సమీపంలో వెలసిన అప్పలాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో, మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయంలోని మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు జరిపారు. భక్తులు భారీగా తరలివచ్చారు. అలాగే బెళుగుప్ప మండలం బూదిగుమ్మలో గల సంజీవరాయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో అప్పలాపురం ఆంజనేయస్వామి

మామిడి మొక్కలు దగ్ధం

గుంతకల్లు టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాలతండా గ్రామ సమీపంలో నాగరాజు నాయక్ అనే రైతుకు చెందిన మామిడి తోటలో మంటలు వ్యాపించి మొక్కలు దగ్ధమయ్యాయి. శనివారం మధ్యాహ్నం తోటకు వెళ్లగా మంటలు వ్యాపించి మామిడి మొక్కలు అంటుకున్నాయని, పొలం సమీపంలో కొండ వద్ద ఉన్న గడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని, ఆ మంటలు తన మామిడి తోటకు వ్యాపించాయని బాధిత రైతు తెలిపాడు. సుమారు 350 మామిడి మొక్కలు దగ్ధమయ్యాయని, రూ. 20లక్షలు నష్టం వాటిల్లిందని ఆయన వాపోయాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

మామిడి చెట్టు కంచెకు నిప్పు

కళ్యాణదుర్గంరూరల్: మండలంలోని తూర్పుకోడిపల్లిలో రైతు బసవరాజుకు చెందిన మామిడితోట కంచెకు గుర్తుతెలియని దుండగులు శనివారం నిప్పుపెట్టారు. అటుగా వెళ్లిన గొర్రెల కాపరులు గమనించి ఫైర్‌సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే కంచెతో పాటు దాదాపు 20 మామిడి చెట్లు, స్ప్రింక్లర్లు పైపులు, డ్రిప్పులు కాలిపోయినట్లు బాధితరైతు తెలిపారు. రూ. లక్ష నష్టం వచ్చినట్లు చెప్పారు.

వైభవంగా నరసింహస్వామి జలధి

బొమ్మనహాళ్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉప్పరహాళ్ గ్రామంలో ఉప్పరాళయ నరసింహస్వామి జలధి శనివారం వైభవంగా జరిగింది. నిర్వాహకులు ఉదయం 11 గంటలకు ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఉద్దేహాళ్ గ్రామ సమీపంలోని వేదావతి హగరినదిలోకి తీసుకెళ్లి.. అక్కడ చెలిమి తవ్వి గంగాజలాలతో అభిషేకించారు. తిరిగి విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి సాయంత్రం తీసుకొచ్చారు. వేలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సతీమణి కాలవ విజయలక్ష్మి స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. సర్పంచ్ ముల్లంగి భారతి భాస్కర్‌నాయుడు, ఎంపీటీసీ ముల్లంగి నాగమణి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుష్పకవిమానంపై చెన్నకేశవస్వామి

పుష్పక విమానంపై చెన్నకేశవుడు

యాడికి, మార్చి8(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చెన్నకేశవస్వామి పుష్పక విమానంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పక విమానంపై దర్శనమిచ్చిన స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

● మహిళా దినోత్సవంలో వక్తలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్ని అన్ని ప్రాంతాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మహిళలతో కలిసి కేక్‌లు కట్ చేశారు. వివిధ రంగాల్లో ప్రగతి సాధించిన మహిళలకు సన్మానం చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతిఒక్కరూ వారిని గౌరవించాలని సూచించారు. ఇక పలు విద్యాసంస్థల్లోనూ.. కార్యాలయాలోనూ ఈ వేడుకలు జరిగాయి. వివిధ గ్రామాల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీలు నిర్వహించారు.



గుంతకల్లులో హాస్టల్ విద్యార్థినులతో టీడీపీ నాయకులు



పామిడిలో స్వీపర్లను సత్కరిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్ తదితరులు



రాయదుర్గం టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళా నేతలు



కళ్యాణదుర్గంలో మహిళల ర్యాలీ



ఉరవకొండలో పారిశుధ్య మహిళాకార్మికులకు సన్మానం